
సాక్షి
గుంటూరు
మంగళవారం । 23 । మే । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.4,000, మోడల్ ధర రూ.3 000 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 520.90 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.90 అడుగుల వద్ద ఉంది.

మహంకాళీ దేవస్థానానికి విరాళం



తాడేపల్లి రూరల్ : కంఠంరాజు కొండూరులోని శ్రీ మహంకాళీ దేవస్థానానికి విజయవాడకు చెందిన ఒడుగు సురేష్, శ్యామల దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. నగదును సోమవారం ఆలయ ఈవో వెంకటరెడ్డికి అందజేశారు.

‘అగ్రి’పథాన నిలవాలి



స్నాతకోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్ , వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు



జీవితం అంత తేలిక కాదు.. మీలో మీరు బలంగా ఉన్నప్పుడే తేలికగా కనిపిస్తుంది. నీ కష్టాలకంటే నీవు పెద్దవాడివి.. నిన్ను జయించేలా చేసేందుకు నిన్ను మించినవాడు లేడు. నీ లక్ష్యాల్ని చేరుకోవడానికి నీకు ఎవరి సానుభూతి అక్కర్లేదు. మీరు మాత్రమే మీ కలల్ని నేరవేర్చుకోగలరు. నక్షత్రాలకు ఎగరాల్సిన వారు పర్వతాన్ని అధిరోహించడం చాలా చిన్న విషయం...

– గవర్నర్

- విద్యార్థులు ఐసీఏఆర్ అవార్డులు సాధించడం హర్షణీయం
- ఎన్జీరంగా వ్యవసాయ కళాశాల స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్లలోని ఎన్జీరంగా వ్యవసాయ కళాశాలలో సోమవారం నిర్వహించిన 55వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు, అందుకు కారకులైన అధ్యాపకుల్ని ఆయన ప్రశంసించారు. యూనివర్సిటీ విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ కనపరిచి ఐసీఏఆర్ అవార్డులు సాధించడం, పీజీ స్కాలర్‌షిప్‌లు పొందడం అభినందనీయమని తెలిపారు. వ్యవసాయ అభివృద్ధి కోసం యూనివర్సిటీ చేస్తున్న కృషిని కొనియాడారు. విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఐసీఏఆర్ 2021 డిసెంబర్ 3న అగ్రికల్చరల్ యూనివర్సిటీ ర్యాంకింగ్ సిస్టం (ఏయూఆర్ఎస్) కింద జాతీయ ర్యాంకింగ్‌లను ప్రకటించగా, 2020–21 సంవత్సరానికి జాతీయ స్థాయిలో 11వ, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో 7వ స్థానాన్ని సాధించిందని తెలిపారు. జాతీయ స్థాయిలో వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగంలో స్కాచ్ సిల్వర్ అవార్డు– 2022, స్కాచ్ ఆర్డర్ అఫ్ మెరిట్ అవార్డు లభించినట్లు చెప్పారు. తిరుపతిలో అభివృద్ధి చేసిన రెండు యంత్రాలు (మల్టీ టాస్క్ టూల్ బార్, నాప్సాక్ వీడర్) వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ ద్వారా వినూత్న వ్యవసాయ యంత్రాలుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. దీనికి గానూ భారత ప్రభుత్వం కాపీరైట్ కార్యాలయం ద్వారా 2020 జూన్ 8న విశ్వవిద్యాలయం ఫర్టిలైజర్ ప్లానర్ 2015కు కాపీ హక్కు (పేటెంట్) మంజూరు చేశారని తెలిపారు. ఐసీఏఆర్‌లో అత్యధిక సంఖ్యలో స్కాలర్‌షిప్‌లు పొందిన యూనివర్సిటీల్లో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. స్కాలర్‌షిప్‌లు అందుకున్నందుకు సహకరించిన సిబ్బందికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

పలు అవార్డుల ప్రదానం

స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ అధ్యాపకులు, విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. టీచింగ్ విభాగంలో మెరిటోరియస్ టీచర్ అవార్డు, రీసెర్చ్ శాస్త్రవేత్తలు, విస్తరణ శాస్త్రవేత్తలు, యువ శాస్త్రవేత్తల అవార్డుల్ని నలుగురికి అందజేశారు. పీజీకి సంబంధించి 22 మందికి, అండర్ గ్రాడ్యుయేషన్‌కు సంబంధించి 10 మందికి పురస్కారాలు అందజేశారు. అనంతరం స్నాతకోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి, కళాశాల అసోసియేట్ డీన్ వి. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నగరానికి సీఎం వైఎస్.జగన్

ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరు నగర పర్యటన దృష్ట్యా ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ మార్గాల మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నట్లు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సోమవారం తెలిపారు. సీఎం ప్రయాణించే సమయంలో శ్యామలానగర్, పట్టాభిపురం మెయిన్ రోడ్డులో ట్రాఫిక్‌ను అనుమతించరు.

- జీటీ రోడ్డులోని మెడికల్ క్లబ్ నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే వాహనాలు, ఎత్తు రోడ్డు సెంటర్, జీటీ రోడ్డులోని ఐటీసీ నుంచి నగరంపాలెం పీఎస్, ఎస్‌బీఐ జంక్షన్ వైపు వాహనాల్ని కూడా మస్తాన్ దర్గా, ఎత్తు రోడ్డు సెంటర్ రోడ్డు మీదుగా మళ్లిస్తారు.
- నగరంపాలెం ఎస్‌బీఐ జంక్షన్ నుంచి కంకరగుంట బ్రిడ్జి వైపు వెళ్లే వాహనాల్ని మెడికల్ కాలేజీ రోడ్డు వైపునకు, ఏటీ అగ్రహారం, కంకరగుంట వైపు నుంచి కలెక్టరేట్ ఎదురు రోడ్డుకు వచ్చే వాటిని కంకరగుంట అండర్ బ్రిడ్జి మీదుగా పట్టాభిపురం వైపు మళ్లిస్తారు.
- కలెక్టరేట్ నుంచి కంకరగుంట బ్రిడ్జి మీదుగా పట్టాభిపురం వైపునకు వెళ్లే వాహనాలకు అనుమతి ఉండదు.
- పట్టాభిపురం, రవీంద్రనగర్, శ్యామలానగర్, గుజ్జనగుండ్ల మీదుగా కలెక్టరేట్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను టీజేపీఎస్ కళాశాల వద్ద కంకరగుంట ఫ్లైఓవర్ పైకి మీదకు అనుమతించరు. అండర్ పాస్ ద్వారా కలెక్టరేట్ వైపు అనుమతిస్తారు.
- సీఎం ప్రయాణించే మార్గంలోని శ్యామలానగర్ ఒకటి, రెండు, మూడో రోడ్ల వద్ద ట్రాఫిక్ అంక్షలు ఉంటాయి. శ్యామలానగర్ రైల్వేగేటు నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంటు సెంటర్ వైపు వచ్చే వాహనాల్ని అందుబాటులో ఉన్న మార్గాల వైపు మళ్లిస్తారు.
- హౌసింగ్ బోర్డ్, ఎన్జీవో కాలనీ నుంచి శ్యామలానగర్ రైల్వేగేటు వైపు వచ్చే వాహనాలు నల్లపాడు నుంచి చుట్టుగుంట వైపు వెళ్లే రోడ్డును వినియోగించాలి.
- శ్యామలానగర్ గేటు వైపు వచ్చే వారు దాటకుండా, ఆర్.అగ్రహారం పక్కనున్న రోడ్డు ద్వారా కంకరగుంట అండర్ పాస్‌కు వెళ్లి, అక్కడ నుంచి పట్టాభిపురం వైపు, మరో అండర్ పాస్ ద్వారా కలెక్టరేట్ వైపు మళ్లాలి.

న్యూస్‌రీల్

ఫేస్ యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు

పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి



నరసరావుపేట రూరల్: వేలిముద్రలు పడని రైతులంతా పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందేందుకు ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు చేపడుతున్నట్లు పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని జొన్నలగడ్డ రైతుభరోసా కేంద్రంలో నూతనంగా ప్రవేశపెట్టిన ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు సమస్యలతో ఇబ్బందులు పడే రైతులు ఫేస్‌యాప్ ద్వారా ఈకేవైసీ నమోదు చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఈ.మస్తానమ్మ, విస్తరణాధికారులు కె.బ్రహ్మయ్య, పి. గోపిరెడ్డి, సహాయకులు పిలిఫ్, పవన్‌కుమార్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ఆర్బీకేలకు బడ్జెట్ విడుదల

కొరిటిపాడు(గుంటూరు): 2023–24 సంవత్సరానికి సంబంధించి రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)కు మొదటి క్వార్టర్ బడ్జెట్ విడుదలైంది. గుంటూరు జిల్లాలో 249 కేంద్రాలకు గానూ రూ.2,10,39,630 మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్టేషనరీ కోసం రూ.75,052, ఆర్‌బీకేల నిర్వహణ (మెయింటెనెన్స్) కోసం రూ.2,49,000, ఇంటర్నెట్ కోసం రూ.13,85,934, అడ్మినిస్ట్రేటివ్ ఖర్చుల కోసం రూ.63,318 విడుదల చేసింది. అద్దె చెల్లింపులకు రూ.1,92,66,326 మంజూరైనట్లు వ్యవసాయశాఖ అధికారులు సోమవారం తెలిపారు.

26న వినుకొండలో మెగా జాబ్ మేళా



నరసరావుపేట: వినుకొండలో ఈనెల 26న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ కోరారు. జాబ్ మేళా వాల్‌పోస్టర్‌ను కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో పట్టణంలోని లాయర్ స్ట్రీట్‌లో గల ఫస్ట్ వార్డ్ గర్ల్స్ హైస్కూలులో ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జాబ్ మేళాకు 14 కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. జీతం అర్హతను బట్టి రూ.10వేలు నుంచి రూ.30వేలు వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ చదివిన 18ఏళ్ల నుంచి 40ఏళ్లలోపు యువతీ యువకులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన తెలిపారు. ముందుగా www.aprrdc.in అనే వెబ్‌సైటులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వీలుకాని పక్షంలో జాబ్ డ్రైవ్ జరిగే ప్రదేశంలో చేసుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు పాల్గొన్నారు.

శరత్‌బాబుకు అమరావతితో అనుబంధం

అమరావతి: ప్రముఖ నటుడు శరత్‌బాబుకు అమరావతితో అనుబంధం ఉంది. పెళ్లీడుపిల్లలు సినిమా షూటింగ్‌ను ఇక్కడే జరిపారు. బాపు దర్శకత్వంలో 1982లో దుక్కిపాటి మధుసూదనరావు అతి తక్కువ బడ్జెట్‌లో దీన్ని నిర్మించారు. సినిమా షూటింగ్‌ను అమరావతిలోని రాజాగారి కోట, అమరేశ్వర స్వామి దేవాలయం, కృష్ణానది లంకలు, వైకుంఠపురం గ్రామ పరిసరాల్లో నెల రోజుల పాటు చేశారు. సురేష్, విజయశాంతి, సాయిచంద్, సుమలత, సోమయాజులు తదితర నటులు నటించారు. శరత్‌బాబు నటి సంగీతలో కలసి ముఖ్యపాత్రలో నటించిన సన్నివేశాల్ని, జ్ఞాపకాల్ని అమరావతి గ్రామస్తులు గుర్తుకు తెచ్చుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

గుంటూరు వెస్ట్: స్పందనలో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని సహించే ప్రసక్తే లేదని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీల్ని కొందరు ఉద్యోగులు తమ వద్దే పెట్టుకుని కాలయాపన చేస్తున్నారని, సెలవుపై ఉంటే సహచర ఉద్యోగికి బదిలీ చేయాలని ఆదేశించారు. సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన అర్జీదారులకు సరియైన సమాధానాలు చెప్పి పంపాలని చెప్పారు. ప్రజలతో ఉద్యోగులంతా మర్యాదగా మెలగాలని ఆయన సూచించారు. మొత్తం వచ్చిన 165 అర్జీల్ని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా అధికారులు పరిశీలించారు.

పకడ్బందీగా పట్టాల పంపిణీ

- అన్ని ఏర్పాట్లు పూర్తి
- కలెక్టర్లు వేణుగోపాలరెడ్డి, ఢిల్లీరావు



మాట్లాడుతున్న గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్‌రెడ్డి. సమావేశంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్సీ తలశిల తదితరులు

తాడేపల్లి రూరల్ : నవరత్నాల్లో భాగంగా సీఆర్‌డీఏ పరిధిలో ఈనెల 26న పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్న దృష్ట్యా మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుతో కలసి వివిధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా, ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్లు వేణుగోపాలరెడ్డి, ఢిల్లీరావు మాట్లాడుతూ నవరత్నాల్లో భాగంగా రెండు జిల్లాల లబ్ధిదారులకు సీఆర్‌డీఏ పరిధిలోని వెంకటపాలెం, కృష్ణాయపాలెం, నవులూరు, నిడమర్రు ప్రాంతాల్లో లే అవుట్లు సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమానికి రెండు జిల్లాల నుంచి లబ్ధిదారులు భారీ సంఖ్యలో పాల్గొంటున్న దృష్ట్యా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్, తాగునీరు అందించనున్నామని, ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్, పారిశుద్ధ్య పనులు పూర్తి చేశామని చెప్పారు. సభ వద్ద కూడా అపశ్రుతులు జరకుండా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. మొబైల్ టాయిలెట్లుతో పాటు పార్కింగ్, సభా ప్రాంగణం దగ్గర లబ్ధిదారులు కూర్చునేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు వివిధ శాఖ అధికారులకు బాధ్యతలు అప్పజెప్పినట్లు వారు తెలిపారు. ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, ఎన్‌టీఆర్ జిల్లా సంయుక్త కలెక్టర్ సంపత్‌కుమార్, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ఆలీం బాష, అడిషనల్ ఎస్పీ అనిల్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, విజయవాడ సబ్ కలెక్టర్ అజిత్‌సింగ్, గుంటూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డెప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ షేక్ కరీం, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ ఘని, డీపీవో కేశవరెడ్డి, డెప్యూటీ కలెక్టర్ మోవిడి వాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ‘అడ్వాన్స్‌డ్’కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి జూన్ ఒకటో తేదీ వరకు పరీక్షలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 100 కేంద్రాలు
- హాజరుకానున్న 49,771 మంది విద్యార్థులు
- కలెక్టర్ల అధ్యక్షతన ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు
- ఇంటర్మీడియెట్ విద్య ఆర్ఐవో గర్నెపూడి సునీత వెల్లడి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈనెల 24 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్ఐవో గర్నెపూడి సునీత చెప్పారు. సాంబశివపేటలోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 100 పరీక్ష కేంద్రాల పరిధిలో 49,771 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. వీరిలో ప్రథమ సంవత్సరం 36,173, ద్వితీయ సంవత్సరం 13,598 మంది ఉన్నారని వివరించారు. గుంటూరు జిల్లా పరిధిలోని 54 కేంద్రాల్లో 28,149, పల్నాడు జిల్లాలోని 34 కేంద్రాల పరిధిలో 16,631, బాపట్ల జిల్లాలోని 12 కేంద్రాల్లో 4,991 మంది చొప్పున హాజరు కానున్నట్లు తెలిపారు. జూన్ 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న జరగనున్న ఎన్విరాన్‌మెంటల్ పరీక్షలకు గతంలో తప్పిన, గైర్హాజరైన ఫస్టియర్ విద్యార్థులు విధిగా హాజరుకావాలని ఆమె స్పష్టం చేశారు. ఇంటర్ పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థుల సహా విధుల్లో ఉన్న ఏ ఒక్కరికీ సెల్‌ఫోన్లతో వచ్చేందుకు అనుమతి లేదని చెప్పారు. పరీక్షల విధుల్లో ఉన్న అధికారులతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులు, ఇన్విజిలేటర్ల వద్ద సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతి లేదన్నారు. సమావేశంలో డీఈసీ సభ్యులు జి. బాలమోహన్‌రావు, పి.సుధాకర్, పాండురంగారావు పాల్గొన్నారు.

ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో...

- ప్రథమ సంవత్సర పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు.
- విద్యార్థులు నిర్దేశిత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఆలస్యంగా వచ్చే వారిని అనుమతించరు.
- విద్యార్థులు హాల్ టికెట్, ప్యాడ్, పెన్ను మరే ఇతర సామగ్రి వెంట తీసుకు రాకూడదు.

ప్రత్యక్ష నిఘా .. విస్తృత తనిఖీలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 100 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.
- ఇంటర్‌బోర్డు నుంచి ఉన్నతాధికారులు లైవ్ స్ట్రీమింగ్ విధానంలో ప్రత్యక్షంగా పరిశీలిస్తారు.
- పరీక్ష కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసుల నిరోధానికి బోర్డు నుంచి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు మూడు జిల్లాల కలెక్టర్ల సారథ్యంలో తహసీల్దార్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహిస్తాయి.
- సమస్యలు, సందేహాల పరిష్కారానికి గుంటూరు ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ (0863–2228528) ఏర్పాటు

60 శాతం బెటర్‌మెంట్ విద్యార్థులే..

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో ఫస్టియర్ విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏకంగా 36,173 మంది దరఖాస్తు చేయగా, వీరిలో పరీక్షల్లో తప్పిన విద్యార్థుల కంటే అధిక మార్కుల కోసం బెటర్‌మెంట్ రాస్తున్న వారు 60 శాతం మంది ఉండటం గమనార్హం.

బొట్టుపెట్టి ఆహ్వానం



ఉండవల్లిలో మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానిస్తున్న సచివాలయ సిబ్బంది

పేదల ‘పట్టా’భిషేకానికి రండి !

- 26న ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ

తాడేపల్లిరూరల్ : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పేదల ఇళ్లపట్టాల పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈనెల 26న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.ఈ క్రమంలో మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి ఇళ్ల పట్టాల పంపిణీకి రావాలని అక్కచెల్లెళ్లకు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్నారు. సచివాలయ సిబ్బంది సోమవారం తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్‌లోని పెనుమాక, వడ్డేశ్వరం, కొలనుకొండ, గుండిమెడ, చిర్రావూరు, ప్రాతూరు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

11,822 మంది లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

మంగళగిరి కార్పొరేషన్ పరిధిలో 11,822 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే కృష్ణాయపాలెం, నవులూరు, వెంకటపాలెం, నిడమర్రు ప్రాంతాల్లో దాదాపుగా సొంత ఇల్లు లేని నిరుపేదలకు అందజేసేందుకు ప్లాట్లను సిద్ధం చేశారు. ఈ నెల 26న వెంకటపాలెం, కృష్ణాయపాలెం మధ్య అమరావతి రోడ్డులో ఏర్పాటు చేసిన లే అవుట్లలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పట్టాలు పంపిణీ చేయనున్నారు. అర్హులైన మహిళలందరికీ ఇప్పటికే వలంటీర్ల ద్వారా పట్టాలు అందజేస్తామని సమాచారం అందించారు.

పట్టాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఇళ్ల పట్టా పుస్తకాల్ని సచివాలయ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు సంయుక్తంగా పట్టాలపై ఫొటోలు అతికించడంతో పాటు అక్షర దోషాల్ని తనిఖీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం నాటికి ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయనున్నట్లు కమిషనర్ శారదాదేవి తెలిపారు.

రాజధానిలో సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వెంకటపాలెం(తాడికొండ): తుళ్లూరు మండలం వెంకటపాలెంలో ఈ నెల 26న నిర్వహించనున్న పేదలకు పట్టాల పంపిణీ ఏర్పాట్లను సోమవారం ముఖ్యమంత్రి కార్యక్రమాల కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ పరిశీలించారు. గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్లు ఎం. వేణుగోపాలరెడ్డి, ఎస్. ఢిల్లీరావులతో కలసి ప్రాంగణ ఏర్పాట్లను తనిఖీ చేశారు. సభా వేదిక, గ్యాలరీ, పార్కింగ్ ప్రాంతాల్ని పరిశీలించి సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జి. రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, విజయవాడ సబ్ కలెక్టర్ అజిత్‌సింగ్, గుంటూరు ఆర్డీవో ఆదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆర్ అండ్ బీ ఎస్ఈ నిర్మల, సీఆర్డీయే, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూముల మార్కెట్ విలువ పెంచవద్దని వినతి



పాత గుంటూరు: స్థలాలు, భూముల మార్కెట్ విలువను పెంచవద్దని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా(క్రెడాయి) రాష్ట్ర చైర్మన్ ఆళ్ల శివారెడ్డి కోరారు. ఈ సందర్భంగా సోమవారం క్రెడాయి గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో నగరంపాలెంలోని రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ కార్యాలయంలో డీఐజీ జి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. రిజిస్ట్రేషన్ల ధరలను పెంచవద్దని కోరారు. డీఐజీ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ధరలు నార్మల్‌గానే పెంచుతామని, ఎక్కువగా పెంచడంలేదని తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయి గుంటూరు బేరర్స్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, ప్రెసిడెంట్ మామిడి రాము, ట్రెజరర్ ఎం.ఎస్.వి. కార్తిక్ పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ఆందోళన



చీరాల: పెళ్లి చేసుకుంటానని చెప్పిన ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో తనకు న్యాయం చేయాలంటూ ప్రియురాలు ఆందోళన చేపట్టింది. ఈ ఘటన సోమవారం పట్టణంలోని హైయరోపేటలో చోటుచేసుకుంది. చీరాల థామస్‌పేటకు చెందిన దానం ప్రియ, దేటా ఆనంద్‌లు గత ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. నాలుగు నెలల కిందట పెద్దల సమక్షంలో ఇరువురికి తల్లిదండ్రులు నిశ్చితార్థం చేశారు. ఇప్పుడు పెళ్లికి ప్రియుడు నిరాకరించడంతో పోలీస్‌స్టేషన్‌లో యువతి ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు తనకు న్యాయం చేయలేదని, ప్రియుడితో వివాహం జరిపించాలంటూ ప్రియుడి ఇంటి ముందు ఆందోళన చేపట్టింది. నిశ్చితార్థం చేసుకున్న తర్వాత పెళ్లి నిరాకరించడం ఏంటని, ప్రియుడితోనే వివాహం జరిపించాలన్నారు. లేకుంటే ఆందోళన విరమించనని బాధితురాలు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

మానసిక, శారీరక ఉల్లాసాన్నిచ్చేవి క్రీడలే

– డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్ బాబు

గుంటూరు మెడికల్: మనిషికి మానసిక, శారీరక ఉల్లాసాన్ని ఇచ్చేవి క్రీడలేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ, అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన ఐఎంఏ ఇండోర్ స్పోర్ట్స్‌లీగ్ 2023 విజేతలకు డాక్టర్ శ్రావణ్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. సభకు ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. డాక్టర్ శ్రావణ్ బాబు మాట్లాడుతూ వైద్యులందరూ ఆటవిడుపుగా ఖాళీ సమయంలో క్రీడల్లో పాల్గొనాలన్నారు. అలాచేసినప్పుడు వైద్యులలో గెలుపు ఓటములు తట్టుకొనే ఆత్మస్థైర్యం వస్తుందని తెలిపారు. డాక్టర్ ఆవుల శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్యుల్లో మానసిక ఉల్లాసం కోసమే గతంలో క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించామన్నారు.



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రావణ్‌బాబు

ప్రస్తుతం క్యారమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్ నిర్వహించామన్నారు. దాదాపు 70 మంది వైద్యులు క్రీడల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. డాక్టర్ శ్రావణ్‌బాబు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్‌కు చెందిన మహిపాల్ రెడ్డి, డాక్టర్ ఎం.సుబ్బారావు, ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ వెలగా మహేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ తాతాసేవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్‌పై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన నర్సింగ్ సిబ్బందితో వైద్య అధికారులు

గుంటూరు మెడికల్: నేషనల్ హెల్త్ మిషన్ కార్యక్రమం ద్వారా హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో పని చేస్తున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు సోమవారం గుంటూరు జీజీహెచ్‌లోని శుశృత హాలులో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఆరు రోజులపాటు జరుగనున్న శిక్షణ కార్యక్రమాన్ని గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కుక్కకాటు, పాముకాటు బాధితులకు ఏవిధంగా చికిత్స అందించాలి, సెలైన్లు ఏవిధంగా పెట్టాలనే విషయాలను, చిన్న చిన్న గాయాలకు ఏవిధంగా కుట్లు వేయాలనే విషయాలపై డాక్టర్ శ్రావణ్‌బాబు వివరించారు. కుక్కకాటు తీవ్రత గురించి, రేబిస్ సోకకుండా ఎలాంటి చికిత్స అందించాలనే విషయాలపై డాక్టర్ ప్రభావతి వివరించారు. నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జవ్వాది విజయలక్ష్మి శిక్షణ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స కోసం వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రభుత్వ వైద్య సిబ్బంది తమవంతు బాధ్యతగా శిక్షణ కార్యక్రమాల్లో బాగా నేర్చుకుని నాణ్యమైన సేవలను పేద రోగులకు అందించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే గర్భిణీలకు ఏవిధంగా వైద్యం అందించాలనే విషయాలను కూలం కుషంగా వివరించారు. గర్భిణీల మరణాలు నివారించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శిక్షణలో బాగా నేర్చుకుని గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ట్రైనింగ్ మాన్యువల్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ గిరిధర్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల బోధనా సిబ్బంది, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సత్వరమే అర్జీలు పరిష్కరించాలి

ఏఎస్పీ కె.సుప్రజ

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక- స్పందన (గ్రీవెన్స్) జరిగింది. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ ఫిర్యాదిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల ఇబ్బందులు ఆలకించారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఏఎస్పీ జూమ్ ద్వారా మాట్లాడారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల అర్జీలను పరిశీలించాలన్నారు. కేసుల తీవ్రతను ఆధారంగా చేసుకుని వెంటనే కేసులు నమోదు చేయాలన్నానీ, అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎస్సీఎస్టీ సెల్ డీఎస్పీ విజయశేఖర్, క్రైం డీఎస్పీ ప్రకాష్‌బాబు కూడా అర్జీలు స్వీకరించారు.



సమస్య ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ

డబ్బులు ఇవ్వలేదని దాడి

ఈనెల 6న రాత్రి పెయింటింగ్ పనులు ముగించుకుని ఏటుకూరు- బొంతపాడు వైపు వెళ్తున్నా. ఈ క్రమంలో ఓ కానిస్టేబుల్, మరో ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ అడ్డగించి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఎందుకు యివ్వాలని అడిగితే చితకబాదారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశా . గుర్తు తెలియని వ్యక్తులు కింద కేసు నమోదు చేశారు. గతంలోనూ ఆ దారిలో పలువురిని అడ్డగించి, దోపిడీకి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

– బి.భాగ్యరాజు, అనంతవరపాడు, వట్టిచెరుకూరు మండలం.

కొడుకులే గెంటేశారు.!

సొంత కొడుకులే ఇంటి స్థలం, పొలం కోసం వృద్ధాప్యంలో ఉన్న తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పెద్ద కొడుకు కానిస్టేబుల్, చిన్న కొడుకు తాపీ పనులకు వెళ్లేవాడు. మా అమ్మ నుంచి సంక్రమించిన ఇల్లు, పొలం రాసివ్వాలంటూ తనయులు వేధిస్తున్నారు. ఇటీవల తాము ఉంటున్న ఇంటి నుంచి బయటకు గెంటేశారు. దీంతో ఏ అసరా లేకపోవడంతో సినిమా హాల్ దగ్గర్లోని పొరం బోకు స్థలంలో చిన్న ఇంటిలో ఉంటున్నాం. అల్పాహారం విక్రయించుకుని జీవిస్తున్నాం. అయితే ఇద్దరు కొడుకులు స్థలం, పొలం రాసివ్వాలని బెదిరిస్తున్నారు. ఇటీవల భర్త శ్రీనుకి గుండె శస్త్రచికిత్స జరిగింది. దీంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇద్దరు కుమారుల నుంచి ప్రాణహానీ ఉంది. తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నాం..

–గండికోట గుల్లకమ్మ, ఆమె భర్త శ్రీను, ఈమని గ్రామం, దుగ్గిరాల మండలం.

83 ఏళ్ల వయస్సులో ఇబ్బందులు

మాచర్ల పంచాయతీ కార్యాలయంలో ఈవోగా విధులు నిర్వర్తించి చేసి పదవీ విరమణ పొందా. కొద్ది కాలంగా భార్య పక్షవాతంతో బాధపడుతోంది. ఆరోగ్యం నిమిత్తం సుమారు రూ.4 లక్షలు వరకు అప్పులు చేశా. అయితే నా పెన్షన్ కార్డుని తనయుడికి యిచ్చి బాకీలు తీర్చమని చెప్పా. రెండేళ్ల తరువాత నెలకు రూ.10 వేలు చెల్లించమని అడిగా. ఇటీవల తనయుడు నాపై నానాయాగీ చేశాడు. ఇంకా రూ.8 లక్షలు అప్పు ఉందని బదులిచ్చాడు. అంతేగాక ఇంటి నుంచి బయటకు తరిమేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. 83 ఏళ్ల వయసులో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీనిపై తగు విచారణ జరిపి న్యాయం చేయాలలి.

– షేక్.కబీర్, పాతరెడ్డిపాలెం, చేబ్రోలు మండలం.

ఎమ్మెల్యే మద్దాళి గిరికి మాతృ వియోగం

సంతాపం తెలిపిన నేతలు

పట్నంబజారు: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాతృమూర్తి మద్దాళి శివపార్వతి (68) స్వర్గస్తులయ్యారు. సోమవారం ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత, కిలారి రోశయ్య, నంబూరు శంకరరావు, జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయు డు, డెప్యూటీ మేయర్లు షేక్ సజిల, వనమా బాలవజ్రబాబు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, పార్టీ నేతలు శివపార్వతి భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తల్లి శివపార్వతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విడదల రజిని



తెలంగాణ మద్యం విక్రేత అరెస్ట్

రూ.2.22 లక్షల ఖరీదు చేసే నరుకు పట్టివేత

నగరంపాలెం:అధిక ధరలకు తెలంగాణ మద్యాన్ని విక్రయిస్తున్న పాత నేరస్తుడిని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు-2 పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2.20 లక్షలు ఖరీదు చేసే 218 మద్యం సీసాలు, కారు, మోటారుసైకిల్‌ను సీజ్ చేశారు. ఇన్నర్ రింగ్ రోడ్‌లోని సెబ్-2 స్టేషన్‌లో సోమవారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను సెబ్ ఏఎస్పీ డీఎస్.మహేష్ తెలిపారు. ముందస్తు సమాచారంతో గుంటూరు నగరంలోని గోరంట్ల పరిధిలో సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు నగరంలో ఉంటున్న పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం పెద్ద పాలెం గ్రామ వాసైన కె. మురళీకృష్ణ అనే యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతని వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన



మాట్లాడుతున్న సెబ్ ఏఎస్పీ మహేష్, పక్కన సూపరింటెండెంట్, శిక్షణ ఏఈఎస్, సీఐ

వివిధ బ్రాండ్‌ల 218 మద్యం సీసాలను గుర్తించారు. సదరు వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి కారులో లేదా వివిధ రకాల వాహనాల ద్వారా మద్యం సీసాలను కొనుగోలు చేసుకుని గుంటూరు వచ్చేవాడని దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం ఆ మద్యాన్ని తన మోటారు సైకిల్ ద్వారా గ్రామాలకు వెళ్లి తెలిసిన వారికి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునే వాడు. మొబైల్‌ఫోన్ ద్వారా కూడా విక్రయాలు చేసేవాడని చెప్పారు. గతంలోనూ అతనిపై సెబ్ గుంటూరు-1 స్టేషన్‌లో మూడు కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఎన్.అన్నపూర్ణ, శిక్షణ ఏఈఎస్ కె.జయమౌనిక, గుంటూరు-2 సీఐ కె.కర్ణ, ఎస్ఐ ఈ.కల్యాణ చక్రవర్తి, హెచ్‌సీ కె.ప్రేమ్ కుమార్, కానిస్టేబుళ్లు వీసీహెచ్.ఆంజనేయులు, సీహెచ్.ఆంజనేయులు, కె.పూర్ణచంద్రరావు, పి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీ వలలో దేవదాయశాఖ ఉద్యోగి

నగరంపాలెం: లంచం తీసుకుంటూ దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గుంటూరు అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీలు టి.వి.వి.ప్రతాప్‌కుమార్, ఎన్.సత్యానందం తెలిపిన వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామ పరిధిలో శ్రీసీతారామ స్వామి దేవస్థానానికి గుంటూరు గుజ్జనగుండ్లకు చెందిన సీహెచ్.శ్రీనివాసరావు ధర్మకర్త. దేవస్థానం పరిధిలో ఉన్న భూమికి సంబంధించి లీజు చెల్లింపులు సక్రమంగా జరగడం లేదని గ్రామస్తులు గుంటూరు నాజ్ కూడలిలోని దేవదాయ ధర్మదాయ శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరుగుతుండగా రూ.10 వేలు చెల్లించాలని ధర్మకర్తను ఇన్స్‌పెక్టర్ (సీనియర్ అసిస్టెంట్) ఎం. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. దీంతో మొదటి విడతగా రూ.5 వేలు చెల్లించాడు. ఈ క్రమంలో ధర్మకర్త శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ వేశారు. రూ.5 లక్షల లోపు ఉన్న దేవాలయాలకు కొన్ని ఫీజుల్లో మినహాయింపులు యివ్వాలని దాఖలు చేశారు. దీనికిగాను కౌంటర్ ఫైల్ చేసేందుకు రూ.5 వేలు ధర్మకర్తను అడగ్గా, ఆయన ఇటీవల ఏసీబీ గుంటూరు అధికారులను ఆశ్రయించారు. దీంతో సోమవారం సాయంత్రం శ్రీనివాసరావు వద్ద రూ.5 వేలు లంచం తీసుకున్న ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వరరావుని ఏసీబీ అధికారులు అక్కడికక్కడే పట్టుకున్నారు. బాధితుడు టోల్‌ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదు యివ్వడం జరిగిందని డీఎస్పీలు తెలిపారు. సీఐలు రవిబాబు, అంజిబాబు, సురేష్‌బాబు, మన్మధ రావు, సిబ్బంది శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



పట్టుబడిన వెంకటేశ్వరరావు

కేఎల్‌యూలో ముగిసిన జాతీయస్థాయి పోటీలు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద నృత్య, కుంగ్‌ఫూ పోటీలు సోమ వారంతో ముగిశాయని విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నటరాజ నాట్యాలయం, న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీలకు ఏపీ ఇంటెలిజెన్స్ ఎస్పీ సరిత ముఖ్య అతిథిగా విచ్చేశారని తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న అని రకాల యుద్ధ కళలు (మార్షల్ ఆర్ట్స్), నాట్య మయూరి, నాట్య భగీరథ, భరతనాట్యం, కూచిపూడి, కథకళి వంటి శాస్త్రీయ, జానపద నృత్యాలలను ప్రదర్శించి అత్యంత ప్రతిభ కనబర్చిన విజేతలకు బహుమతులను అందజేశామన్నారు. ఈ పోటీలలో సబ్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని వి.వన్షిక, ఎం.ఉజ్వల సొంతం చేసుకోగా, ఎం.మోక్ష, ఐ.రువాన్స్, ఎం.అక్షరలు ద్వితీయ స్థానంలో నిలిచారని అన్నారు. జూనియర్ విభాగంలో ప్రథమస్థానాన్ని ఎం.మోక్షిత్, జె.యశ్వంతలు సాధించగా, వి.లోచనా, పి.భూషణ్‌లు ద్వితీయ స్థానంలోను, అజయ్ తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. సుమారు 500 మంది కళాకారులు నృత్య పోటీలలో పాల్గొనగా, కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో సుమారు 200 మంది పాల్గొన్నారని, విజేతలకు ఇంటెలిజెన్స్ ఎస్పీ సరిత బహుమతుల ప్రదానం చేశారని వివరించారు. కేఎల్‌యూ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ న్యాయ నిర్ణేతలుగా విశాఖకు చెందిన ప్రభాకర్, హైదరాబాద్‌కు చెందిన పోతిని శ్రీనివాసరావు, గుమ్మళ్ల ప్రభాకరరావులు వ్యవహరించారని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, విశ్రాంత ఎసీప సిహెచ్ చక్రపాణి, ఎం.ఎన్. రవికుమార్, కె.రాజశిఖామణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఇంటెలిజెన్స్ ఎస్పీ సరిత